International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-7(1), July, 2016
Impact Factor: 3.656; Email: drtvramana@yahoo.co.in

# A COMPREHENSIVE ANALYSIS OF DHIMSA TRIBAL DANCE

## (థింసా నృత్యం- సమగ్ర విశ్లేషణ)

***Dr. B.VENKATASWAMY**

MA(Tel).,MA(San).,MA(Ling).,MA(Mcj).,PhD

H.O.D. & Research Director, Dept.,of Telugu, P.A.S.College, Pedanandipadu, Guntur - 522 235

**ABSTRACT** (సంగ్రహ పరిచయం)ః


భారతదేశంలో ఎన్నోరకాల మతాలు, కులాలు, జాతుల వాళ్ళు నివశిస్తున్నారు. వారిలో గిరిజన జాతి ముఖ్యమైంది. మొట్ట మొదట ఈ దేశ ఆదివాసులుగా పిలవబడుతున్నారు. అడవులను కొండలను ఆశ్రయించుకొని జీవిస్తున్న గిరిజనుల ఎటువంటి కల్మషంలేని స్వచ్ఛమైన, నిర్మలమైన జీవితాలను గడుపుతున్నారు. ఆధునిక నాగరికత వాసనలకు దూరంగా తమదైన దైనందన జీవితాలను గడిపే వీరు సంఘానికి, మతానికి, మతానికి సంబంధించిన అంశాలకు ఎంతో విలువ ఇస్తారు. ముఖ్యంగా మత సంబంధమైన కార్యక్రమాలలో, పండుగలు - పబ్బాల సమయంలో చేసే నృత్యం ద్వారా తమ మనోభావాలను ఇతరులకు వ్యక్తీకరిస్తారు. ఇటువంటి నృత్యాలు తమ తెగల మధ్య దూరాన్ని తగ్గించి ఐక్యమత్యంగా ఉంచుతుందని వీరి ప్రగాఢ విశ్వాసం. వీరు రకరకాల నృత్యాల ద్వారా తమలోని భావాలను, బాధలను, ఆనందాలను ఒకటేమిటి సమస్త విషయాలను అభివ్యక్తం చేయడానికి దీనిని వారిధిగా ఉపయోగించుకుంటారు.

**Key Words** (ముఖ్యాంశాలు) ః

గిరిజన ప్రాంతాలు,థింసా నృత్యాలు,రకాలు. బోడ థింసా, గొడ్డిబేట థింసా, గుండేరి థింసా, పొతరతోల థింసా, భాగ్ థింసా, నాట్యకరియా థింసా, కుండ థింసా, భాయ థింసా.

**Introduction** (ఉపోద్ఘాతం)ః

ఆంధ్రదేశంలో నివశిస్తున్న ఈ గిరిజన తెగలను భౌగోళిక పరంగా 4 ప్రధాన మండలాలుగా విభజించవచ్చు. ఆంధ్రదేశంలో 4 ప్రధాన మాండలిక ప్రాంతాలున్నట్టే గిరిజనులు విస్తరించిన ప్రాంతాన్ని, జనాభాని బట్టి కళింగాంధ్రప్రాంతం, గోదావరి మండలప్రాంతం, తెలంగాణా ప్రాంతంతోపాటు మైదాన ప్రాంతంగా పేర్కొనవచ్చు. ఇందులో మైదాన ప్రాంతంలో మరల రెండు ఉపప్రాంతాలుగా వర్గీకరించవచ్చు. అవి చెంచులు ఉండే నల్లమల్ల ప్రాంతం, ఎరుకలు, యానాది, లంబాడీలు నివశించే మైదాన ప్రాంతంగా చెప్పవచ్చు. ఈ ప్రాంతాలను ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.



ఈ నాలుగు మండలాలలో నివశిస్తున్న ప్రజల జీవన విధానంలోనూ, ఆహారపు అలవాట్లలోనూ, సేకరణలోనూ, మతసంబంధ విషయాలలో వైవిధ్యమున్నట్లే వాళ్ళు చేసే నృత్యాలలో కూడ వైవిధ్యం చోటు చేసుకోవడం కన్పిస్తుంది. ముఖ్యంగా అటవీ, కొండ ప్రాంతాన్ని ఆధారం చేసుకొని జీవించే ఈ గిరిజన జాతుల వారు అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర తెలంగాణా నుండి కోస్తాంధ్ర ఉత్తర భాగం ముఖ్యంగా గోదావరీ నదీ పరివేష్టిత ప్రాంతం వరకు ఒకే రకమైన నృత్య ప్రదర్శనను అన్ని గిరిజన ప్రజలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఆ గిరిజన నృత్యమే థింసా. ఈ థింసా నృత్యం కళింగాంధ్ర గోదావరి మండలాలలో చేసేదానికి తెలంగాణా ప్రాంతంలో చేసేదానికి కొంత తేడా ఉన్నప్పటికీ అజరామమై అడవితల్లి బిడ్డల కాలి అందెలతో కలసి ఘల్లుఘల్లుమని వినిపిస్తూనే ఉంది. ముఖ్యంగా థింసా అనగానే గుర్తుకువచ్చే ప్రాంతం పాడేరు అరుకులోయ. అక్కడ ఏ గిరిజన గూడాన్ని పలకరించినా మొదట థింసా నృత్యం ద్వారా స్వాగతం పలకటం విశేషం. అంతగా వారి జీవితాలలో మమేకమైపోయింది థింసా.


ఆంధ్రదేశంలో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాలలో నివశించే ఆదివాసులైన కమ్మర, వాల్మీకీ, భగత, కొండదొర, ఖోండ్, కోద్, ఖాటియాబోడో మొదలైన జాతులవారు విశేషంగా థింసా నృత్యం చేస్తారు. అయితే మిగిలిన ప్రాంతాల కంటే విశాఖలోని పాడేరు అరుకులోయలో చేసే థింసా నృత్యానికి విశేష ప్రచార్యం లభించింది. ఈ నృత్యం దేశవిదేశీయులను ఆకర్షిస్తుంది. ఈ ప్రాంత వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటం వలన ఇక్కడ ప్రాంతాలను దర్శించే యాత్రికులకు థింసా నృత్యం చూసే ఏర్పాట్లను కూడ ప్రభుత్వం కల్పించడం జరిగింది. దీని వలన గిరిజన ప్రాంతాలకేగాక యావత్ ప్రపంచానికి థింసా నృత్య ప్రత్యేకత వెల్లడి చేయబడింది.

థింసా నృత్యాన్ని చైత్రమాసంలోనూ, పెళ్ళిల్లు, పండుగలలోనూ చేయటం ఆనవాయితీ. ఈ నృత్యంలో 8 సం॥లు ఉన్న పిల్లలు నుండి 80 సం॥ల వయస్సు ఉన్న ముసలి వాళ్ళ వరకు ఎంతో ఉత్సాహంతో పాల్గొంటారు. సహజంగా ఈ నృత్యాన్ని ఒక్క జట్టుగా ఏర్పడిన బృందంచే చేయ బడుతుంది. దీనికి ఒక నాయకుడు ప్రాతినిధ్యం వహిస్తూ వారిని ముందుండి నడిపిస్తూంటాడు. ఈ జట్టు 20 నుండి 30 మంది వరకు పాల్గొంటారు. ఎక్కువగా ఈ నృత్యాన్ని ఆడవాళ్ళు చేస్తుంటారు. కొన్ని సందర్భాలలో ఇద్దరూ కలసి చేయటం జరుగుతుంది.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-7(1), July, 2016
Impact Factor: 3.656; Email: drtvramana@yahoo.co.in

పండుగల సమయాలలో తండాలోని ప్రజలు కొన్ని బృందాలుగా బయలుదేరి ప్రక్క గ్రామాలకు వెళతారు. అక్కడ గ్రామస్థులు వీళ్ల దగ్గరకు ఎదురేగి స్వాగతం పలికి తమ గ్రామంలోకి ఆహ్వానిస్తూ ఆతిథ్యమిస్తారు. వెళ్లిన వాళ్ళు ధింసా నృత్యంతో అక్కడ ప్రజలను మెప్పిస్తారు. అనంతరం ఆతిథ్యం ఇచ్చిన గ్రామస్థులు ఏర్పాటు చేసిన విందు భోజనాలతో అందరూ కలసి పండుగ చేసుకుంటారు. తర్వాత వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేయబడతాయి. గోండులు ఏ విధంగా దండారియా ఉత్సవాన్ని జరిపి వేడుకలు కలిగిస్తారో అదే విధంగా ఈ గిరిజనులు తాము వెళ్లిన ప్రాంతంలో వినోద వేడుక కార్యక్రమాలు చేస్తారు. దీనికి "సంకిడికేల్‌బార్" అనేపేరు. ఈ వినోద వేడుకలు నిర్వహించిన తర్వాత అందరూ కలసి ధింసా నృత్యం చేసి వీడ్కోలు చెప్పకుంటారు. ఈ విధంగా నృత్యం చేయడమనేది తమ జాతి మధ్య దూరాబారాలు తగ్గించి స్నేహాసౌభ్రాతత్వాలు పెంపొందిస్తాయని, సంబంధ బాంధవ్యాలు గట్టి పరుస్తాయని బలంగా నమ్ముతారు.

ధింసా నృత్యం చేసే సమయంలో ప్రక్క వాయిద్యాల సహాకారం ఎంతో అవసరం. ఇందులో ఆడవాళ్ళు నృత్యం చేస్తుంటే మగవాళ్ళు వాయిద్య పరికరాలతో వారిని ఉత్తేజపర్చటం చేస్తుంటారు. ఒక్కొక్క సందర్భంలో ఆడమగ కలసి ధింసా నృత్యం చేస్తారు. తుడుము, డప్పు, పిల్లనగర్ర, కిరిడి, జోడుకొమ్ములు, మోరి వంటి వాయిద్యాల చప్పుడికి అనుగుణంగా ఎంతో లయాత్మకంగా, కళాత్మకంగా చేసే నృత్యం హృదయాలను కట్టిపడేస్తుంది. ఎటువంటి వారైనా వెళ్లి వారితో ధింసా నృత్యం చేయాలని ఉవ్విళ్ళూరుతుంటారు. డప్పకు అనుగుణమైన తూగు ఒకేసారి కాళ్ళు కదపటం, నడుం కదిలించడం చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఇది వారికి స్వతసిద్ధంగా జన్మత అలవడిన నృత్యం. చక్కని అభినయంతో చేసే ఈ నృత్యం దాదాపు 12 రకాలు ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ ఎక్కువగా గిరిజనులు ప్రదర్శించేవి 8 రకాలు. అవి 1. బోడ ధింసా, 2. గొడ్డిబేట ధింసా, 3. గుండేరి ధింసా, 4. పోతరతోల ధింసా, 5. భాగ్ ధింసా, 6. నాట్యకరియా ధింసా, 7. కుండ ధింసా, 8. భాయ ధింసా.



International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.3, Issue-7(1), July, 2016
Impact Factor: 3.656; Email: drtvramana@yahoo.co.in

### 1. భోడ థింసా:

ఈ నృత్యాన్ని గ్రామ దేవతా ఉత్సవాలలోనూ, జాతర్లలోనూ చేస్తారు. ముఖ్యంగా గ్రామ దేవతను ఆరాధించే క్రమంలో థింసా తప్పని సరిగా చేస్తారు. ఈ నృత్యాన్ని ఆడవాళ్ళు, మగవాళ్ళు కలిసి ఒక బృందగా ఏర్పడి చేస్తారు. ఇందులో మగవాళ్ళు కుడివైపు ఆడవాళ్ళు ఎడమవైపు వరుసలలో బారుగా నిలబడి ఒకరి చేతులు మరొకరి వీపు వెనుకవైపుకు పోనిచ్చి నడుమును గట్టిగా పట్టుకుంటారు. మగ వరుసలోని మొదటి వ్యక్తి జట్టు నాయుకుడిగా వ్యవహరిస్తూ నెమలి ఈకల గుత్తి చేతుల్లో పట్టుకొని లయబద్ధమైన నాట్యంతో అడుగులు కదుపుతూ ముందుకు రాగా ఆడ వారిలోని (ఎడమవైపు) చివరి వ్యక్తి వచ్చి ఇతనితో కలుసుకోవడం జరుగుతుంది. అప్పడు మిగతావారంతా నాట్యం చేస్తూ పాము ఏవిధంగా వెళుతుందో అదే విధంగా అటుఇటు కదులుతూ కాళ్ళ గజ్జెల చప్పడుకు అనుగుణంగా తిరుగుతూ హురి, హుయ్ అని పెద్దగా శబ్దం చేస్తూ నృత్యం చేస్తారు. చివరకు రెండుగా చీలి తమ తమ వరుసలలోకి వచ్చి చేరతారు.

ఈ నృత్యం చేయటం వలన గ్రామ దేవత ఆశీస్సులు తమ తండాలపై ఉంటుందని వీరి విశ్వాసం. ముఖ్యంగా వెన్నల రాత్రులలో గ్రామ దేవత పూజ కొరకు ఈ నృత్యం చేయటం ప్రతి గిరిజన తండాలలో కన్పిస్తుంది.

### 2. గొడ్డిబేట థింసాః

ప్రకృతి ప్రియులైన గిరిజనులు కొండలపై నుండి రాళ్ళు దొర్లితే వాటిని ఏ విధంగా పైకి తీయాలో నేర్పే విధంగా రూపొందిన నృత్యమే గొడ్డిబేట థింసా. ఈ నృత్యం వాయిద్యాల ధ్వనులకు తగ్గట్లుగా ప్రదర్శింపబడుతుంది. 20 నుండి 30 మంది గల సభ్యులు ఒకే వరుసలో నిలబడి డప్ప దరువుకు అనుగుణంగా తలలు క్రిందికి వంచి మరలా పైకిలేపి నృత్యం చేస్తారు. ఈ సమయంలో రాళ్ళను పైకెత్తుతున్నట్లు భ్రమను కలిగిస్తూ నృత్యం చేస్తారు. తర్వాత ఒకేసారి ముందుకు వంగి తలలుపైకి లేపుతూ 25 అడుగులు ముందుకు వెళ్ళి మరలా వెనకకు వస్తూ ఉంటారు. ఈ విధమైన ప్రక్రియను నాలుగైదుసార్లు పాటిస్తూ చేయటం ఈ నృత్యం యొక్క ప్రత్యేకత.

**3. గుండేరి థింసా**

గుండేరి థింసాకే మరొక పేరు ఉసుకు థింసా. ఇది శృంగార పరమైన నృత్యం. ఈ నృత్యంలో ఆడవాళ్ళు ఒక బృందంగా మగవాళ్ళు మరొక బృందంగా ఏర్పడతారు. మగ బృందం వారు ఆడ బృందం వారిని తమతో నాట్యం చేయమని ప్రేరేపించే విధంగా పాటలు పాడుతూ ఆహ్వా నిస్తుంటారు. ఆడవాళ్ళు మగవాళ్ళు ముందుకు వెనుకకు కదులుతూ లయబద్ధమైన, నిర్ధిష్టమైన అడుగులతో వలయాకారంగా తిరుగుతూ నాట్యం చేస్తారు. ఇది శృంగార భరితమై సరస సల్లాపాలు కల్గించే నాట్యం కాబట్టి చాలా శక్తి వంతంగానూ, ఉత్సాహవంతంగానూ ప్రదర్శింపబడుతుంది.

**4. పాతరతోల థింసా**

సహజంగా అడవులలో నివశించే ఆదివాసీలు రకరకాల చెట్ల ఆకులను సేకరించి జీవనోపాధిని పొందుతున్నారు. ఆ క్రమంలో ఈ విధమైన ప్రక్రియను కూడ తమ నృత్యంగా మలుచుకొని తృప్తిపడ్డారు అడవితల్లి బిడ్డలు. పాతరతోల థింసా ఆకులను కోసే క్రియను తలపించే విధంగా అంగ విన్యాసంతో కూడిన నృత్యంగా పరిగణించబడుతుంది. ఈ నృత్యంలో సగం మంది ముందు వరుసలో సగం మంది వెనుక వరుసలో నిలబడి ఉంటారు. ముందువున్న వారి భుజాలపై వెనుక ఉన్నవారు తమ చేతులను వేస్తారు. ఆ విధంగా ఉన్న రెండు వరుసల వాళ్ళు తమ తలలను కుడివైపు ఒకసారి ఎడమవైపు మరొకసారి తిప్పతూ నాట్యం చేస్తారు. ఇది చూపరులకు ఆకులు ఏరుతున్నట్లు కన్పిస్తుంది.

**5. భాగ్ థింసా**

కొండల్లో, కోనల్లో, లోయల్లో, అటవీ ప్రాంతంలో గిరిజన పుత్రులకు ఎన్నోరకాల ఉపద్రవాలు ఎదురవు తుంటాయి. అందులో క్రూరమృగాల గురించి చెప్పే పని లేదు. అందుకే ప్రతి ఒక్కరూ తమను తాము రక్షించుకోవాలనే ధైర్యాన్ని, కర్తవ్యాన్ని బోధిస్తూ ఆదిశగా రూపొందించబడ్డ నృత్యమే భాగ్ థింసా.

పులి బారి నుండి ఏ విధంగా తప్పించుకోవాలి, లేదా దానిని ఏ విధంగా లొంగ దీసుకోవాలో తెలియజేసే విధంగా ఈ నృత్యం ఉంటుంది. బృందంలోని సగం మంది చేయి చేయి పట్టుకొని వలయాకారంలో నిలబడతారు తర్వాత కాళ్ళ వేళ్ళ మీద నిలబడి తలలను క్రిందికి వంచుతూ పైకి

లేపుతారు. మిగిలిన వారు ఈ వలయంలోకి ప్రవేశించి వేగంగా కదులుతూ పాము చుట్ట చుట్టు కున్నట్లుగా కలిసిపోతారు. ఇలా చాలా సార్లు తిరిగి తిరిగి చేస్తూ నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

### 6. నాట్యకరియా థింసా

నాట్యకరియా థింసా దీపావళి పండుగ సందర్భంగా వాల్మీకి తెగకు చెందిన వారు మాత్రమే చేసే నృత్యం. ఇది వారి హక్కు పత్రంగా భావించి నృత్యం చేస్తున్నారు. మిగిలిన గిరిజన తెగలవారు ఇతర పండుగల సమయంలోనూ వివాహ సందర్భంలో చేయటం కన్పిస్తుంది. నేడు ఈ నృత్యం అంతగా ప్రాచుర్యం లేదనే చెప్పవచ్చు.

### 7. కుండ థింసా

ఈ నృత్యం కూడ శృంగార పరమైనదే. ఇందులో ఒకరి మీద ఒకరు చలోక్తులు విసురు కుంటూ పాటలు పాడుకుంటూ ఒకరి భుజాలు ఒకరు నెట్టుకుంటూ ఆనందంగా ఉల్లాస భరితంగా నృత్యం చేస్తారు.

### 8. భాయి థింసా

ప్రతి గిరిజన జాతికి ఒక గణాచారి ఉంటాడు. ఇతడు మత పరమైన విషయాలను నిర్వహిస్తూ గిరిజనులచే దైవస్వరూపంగా పరిగణించబడుతుంటాడు. గణాచారి జాతర ఉత్సవాలు చేసే సమయంలో అతనిపైకి దేవత ఆవహించడం వల్ల పూనకం వచ్చి లయాత్మకంగా ఊగుతూ నృత్యం చేస్తాడు. ఆ నృత్యాన్ని గిరిజనులంతా తలలు వంచి చూస్తూ అనుకరిస్తారు. ఈ విధంగా గణాచారికి పూనకం తగ్గి మామూలు స్థితికి చేరుకునే వరకు ఈ నృత్యం కొనసాగుతుంది.

ఈ రకమైన థింసా నృత్యాలేగాక సంక్రాంతి, దీపావళి పండుగల సందర్భంగా చోటి, బొడే థింసా నృత్యాలు చేస్తారు. మనిషి చనిపోయినప్పుడు కూడ వీళ్ళు నృత్యం చేస్తారు. చనిపోయిన కుటుంబానికి ఓదార్పు కలగజేస్తూ ఇంట్లో నుండి పాడె శ్మశానం చేరే వరకు పురుషులందరూ కలసి చొట్లాలి అనే థింసా నృత్యాన్ని చేస్తారు.

ఆదిలాబాద్ జిల్లాలో గోండులు చేసే థింసా నృత్యానికి ఒక ప్రత్యేకత కన్పిస్తుంది. మిగిలిన ప్రాంతాలలో ఎటువంటి అలంకరణలు లేకుండా థింసా నృత్యం ప్రదర్శిస్తుంటే గోండులు మాత్రం

నెమలి ఈకలు తలలకు ధరించి నృత్యం చేస్తూ ప్రత్యేక అలంకరణతో ఆకర్షణీయంగా కన్పిస్తారు. ఈ నృత్యాన్ని కూడ స్త్రీలే చేస్తారు పురుషులు చేయరు. వాళ్ళు ప్రక్క వాయిద్యాల సహకారంతో స్త్రీలు చేసే థింసా నృత్యానికి ఉత్సాహం కలిగిస్తారు.

**Conclusion** (ముగింపు):

గిరిజనులు తమ జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనలకు ప్రతిస్పందనగా నృత్యాలు చేయటం కన్పిస్తుంది. వీరు సాధారణ జీవితాన్ని అనుభవిస్తూనే సంఘాచారాలను సమిష్టిగా నెరవేర్చడానికి ఈ నృత్యాలను ఆశ్రయిస్తారు. వీళ్ళు చేసే నృత్యాలు కూడ తాళగతులకు అనుగుణంగా ఉండటం విశేషం. గిరిజనుల జీవితంలో మమేకమైపోయిన నృత్యాలు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ వారిని ప్రకృతి మాత ఒడిలో సేదతీరేటట్లు చేస్తుంటాయి.